గురుకుల ఏర్పాటు ఫలితమిది..

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

ఐఐటీలో సీటు సాధించిన గోపాల్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,జూలై 19: గత ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన గురుకుల ఫలాలు నేడు కనిపిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి తన నివాసంలో గురుకులంలో చదువుకొని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కి పట్టణంలోని ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన విద్యార్థి గోపాల్‌ను శాలువా కప్పి సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థి గోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని సీఎం కేసీఆర్ చేసిన గురుకులాల ఏర్పాటుతో ఎంతోమంది పేద విద్యార్థుల తల్లిదండ్రుల కలలు సాకారమైనవన్నారు. కార్యక్రమంలో నందిమళ్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, సుబ్బు, అరుణ్‌యాదవ్, యుగంధర్‌రెడ్డి, రాము, రామస్వామి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దమందడి, జూలై 19 : మండలంలోని జంగమాయిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత బోయ ప్రశాంత్ శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దవాఖానకు చేరుకొని ప్రశాంత్ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు కొండల్, మాజీ కౌన్సిలర్ తిరుమల్, అబ్బా యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

వీపనగండ్ల, జూలై 19 : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేవిధంగా అధికారులు నిరంతరం కృషి చేయాలని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అధికారులతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులు, ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల తమ సమస్యలు మంత్రికి విన్నవించారు. ముందుగా ప్రజలు గోపల్‌దిన్నె సింగోటం లింక్ కెనాల్ భూ నిర్వాసితులకు రూ.30లక్షలు ఇవ్వాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ దవాఖానలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన సింగిల్ ఫేజ్ విద్యుత్ కూడా అంతరాయం ఏర్పడుతుందని వీపనగండ్ల, గోవర్ధనగిరి, సంగినేనిపల్లి గ్రామాల నుంచి ఫిర్యాదులు అందాయి. పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులు అందజేయాలని ఫిర్యాదులు చేశారు. అంతకు ముందు మండలంలోని సంగినేనిపల్లి గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి బదిలీ టీచర్లు వచ్చే వరకు ఎవరినీ కూడా రిలీవ్ చేయకూడదని ఎంఈవో లక్ష్మణ్ నాయక్ కు తెలిపాడు. మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఎస్సై నందికర్, డీఈ చెన్నయ్య, ఏఈలు మెహర్ తేజ, ఉదయ్ రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, నారాయణరెడ్డి, మాజీ సింగిల్‌విండో చైర్మన్ బాల్‌రెడ్డి, బీరయ్య, సుదర్శన్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకటయ్య, రాంబాబు, గంగిరెడ్డి, రవీందర్ రెడ్డి, ఆదయ్య, గోపి, బాలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా బదిలీలు

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు పత్రాలను అందజేస్తున్న జెడ్పీసీఈవో యాదయ్య

- జెడ్పీసీఈవో యాదయ్య

వనపర్తి, జూలై 19 : జిల్లా ప్రజా పరిషత్ శాఖ పరంగా ప్రణాళికాబద్ధంగా బదిలీలు చేపట్టినట్లు జెడ్పీ సీఈవో యాదయ్య తెలిపారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న అధికారులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న వివిధ కేడర్ల ఉద్యోగులు,ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నాలుగేండ్లు ఒకే స్థానంలో పనిచేసిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించినట్లు తెలిపారు. మొత్తం 51మంది ఉద్యోగులను బదిలీలు చేసినట్లు తెలిపారు. ఉద్యోగస్తులు వారికి కొత్తగా కేటాయించిన స్థలాల్లో శని వారానికి విధులో చేరాలన్నారు. బదిలీలు ప్రణాళికాబద్ధంగా చేపట్టినందుకు జెడ్పీసీఈవో , డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బందికి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గట్టుమీది భానుప్రసాద్,కార్యదర్శి సయ్యద్ రషీద్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పంచాయితీ రాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TOLET SHOPS
★ Tolet Shops Near one town Police Station, Beside Apollo Pharmacy, Mahabubnagar. Contact: 9542300569.
NT-MBNR

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ ఐటీ పార్క్ దగ్గరలో 1 ఎకరా అగ్రికల్చర్ East Face ల్యాండ్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి: 9642799800 / 9346902007.
NT-Raju Yadav

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

రైతుబంధు నిధులు రుణమాఫీకి మళ్లింపు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గట్టుయాదవ్

వనపర్తి, జూలై 19 : ఎన్నికల ముందు రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నా కాంగ్రెస్ నాయకులు ఇప్పుడేమో విడుతల వారిగా అని రైతులను నట్టేట ముంచుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో శుక్రవారం రైతు రుణమాఫీపై నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడేమో రైతు భరోసా ఎగ్గొటి కొంతమంది రైతులకే రూ.లక్ష రుణమాఫీ చేయడం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి రైతుబంధులోనే రైతులకు రూ.2వేల కోట్లను ఎగ్గొటి వానకాలం రైతుబంధు గురించి పట్టించుకోకుండా, రుణమాఫీ పేరింట రైతులను నట్టేట ముంచిందన్నారు. వానకాలం సీజన్‌కు ఎకరానికి రైతు ఖాతాలో రూ.7500 చొప్పున రూ.10 వేల కోట్లు ఎగ్గొటారన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు బోనస్‌పై రూ.6,500 కోట్లు ఇవ్వకుండా, వాటిని రుణమాఫీకి బదిలీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. భూమి లేని కౌలు రైతులకు రూ.15వేల చొప్పున రూ.6,240 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కోటీ 73లక్షల మంది మహిళలకు నెలకు రూ.2500 ఇస్తానని దాని ఊసే లేదన్నారు. రైతుల మీద కన్నా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంలోనే ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కౌన్సిలర్ నాగన్నయాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు వాసుదేవా రెడ్డి, పట్టణ బీఆర్ఎస్ కార్యదర్శి పరంజ్యోతి, స్టార్ రహీమ్, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆదాయపన్ను పై వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పిస్తున్న ఐటీ శాఖ అధికారులు

ఆదాయపన్ను రీఫండ్‌కు అక్రమ మార్గాలు వద్దు

- ఐటీ అదనపు కమిషనర్, ఐఆర్ఎస్ సుమిత పరమట

వనపర్తి, జూలై 19 : ఆదాయ పన్ను రీఫండ్‌కు ఉద్యోగులు అక్రమ మార్గాలను అనుసరించవద్దని, సక్రమంగా పన్ను చెల్లించి దేశాభివృద్ధికి సహకరించాలని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ ఐఆర్ఎస్ సుమిత పరిమట అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ కార్యాలయం ఉద్యోగులకు ఆదాయపు పన్ను రిటర్న్‌దాఖలు అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్‌షాప్‌నకు ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదాయ పన్నులో మినహాయింపులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఉద్యోగులకు అవకాశం కల్పించినా సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. చాలా మంది ఉద్యోగులు పన్ను మినహాయింపులకు తప్పుడు సమాచారం నమోదు చేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ,మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో 20 శాతం, 30 శాతం రీఫండ్ తీసుకుంటుంటే, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం చాలామంది 90నుంచి 100 శాతం రీఫండ్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ రేంజ్-5 పరిధిలో తప్పుడు వివరాలు అందజేసిన రిటర్న్‌లు 14వేలు గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 10,635 ఉన్నాయని తెలిపారు. ఉద్యోగులకు వచ్చే మూల వేతనం వివరాలన్నీ తమ వద్ద ఉన్నాయని, పలువురు తమ వేతనాలను తక్కువ వేసి రిటర్న్ ఫైల్స్ చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఆదాయ పన్ను శాఖకు సమర్పించిన పత్రాల్లో తప్పులు ఉంటే సవరించి మళ్లీ అందజేయాలని సూచించారు. ఇందుకు వచ్చే ఏడాది మార్చి 31వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.నగేశ్, ఆదాయ పన్ను శాఖ జిల్లా అధికారి మంగళవారపు మనోజ్‌కుమార్, అధికారులు, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కేటిదొడ్డి, జూలై 19 : విద్యుదాఘాతంలో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని గంగన్‌పల్లి గ్రామానికి చెందిన జంగిలమ్మ(46) గ్రామ శివారులోని పొలం వద్ద ఏర్పాటు చేసుకున్న పశువుల షెడ్డుకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో జంగిలమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. భర్త జయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యక్తి మృతి..

మల్దకల్, జూలై 19 : మండలంలోని చర్ల గార్లపాడు గ్రామంలో విద్యుదాఘాతానికి బోయ గూని నల్లన్న (45) మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన నల్లన్న శుక్రవారం మేక పిల్లలకు గడ్డి కోయటానికి తన పొలం దగ్గరకు వెళ్లాడు. స్తంభానికి అనుకొని ఉన్న వైరుకు తీగ చుట్టుకుందన్నారు. ఈ తీగను కోయటానికి గానూ వైరును ముట్టుకోవడంతో విద్యుదాఘతానికి గురి అయినట్లు తెలి పారు. పొలానికి వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కి భార్య రామేశ్వరమ్మతోపాటు ఐదుగురు ఆడ పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గట్టు, జూలై 19 : లైంగిక వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగాపురంలో చేటుచేసుకున్నది. ఎస్సై కేటీ మల్లేశ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మల్లమ్మ(40)కు భర్త వీరన్న పదేండ్ల కిందటే చనిపోగా ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తోంది. కాగా మూడునెలల కిందట నుంచి మల్లమ్మను అదే గ్రామానికి బోయ మల్దకల్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో వేధింపులు భరించలేక ఆమె గురువారం రాత్రి బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు ఆమెను గద్వాల ఏరియా దవాఖానకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ మల్లమ్మ మృతిచెందింది. మృతురాలి సోదరుడు దొడ్డ నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

గద్వాలటౌన్, జూలై 19 : వచ్చే మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ ఈవెంట్ హాల్‌లో శుక్రవారం బీజేపీ జిల్లా కార్యవర్గసమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్పర్‌పాషా, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, శివారెడ్డి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

పెద్దమందడి, జూలై 19: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభయాస్తంలో భాగంగా ముదిరాజ్‌లకు ఇచ్చిన నాలుగు హామీలను నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పుట్టమోని నారాయణ అన్నారు. శుక్రవారం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు వాకిటి నాగభూషణం, నాగేంద్రం, వాకిటి నరేశ్‌కుమార్, జంగం రమేశ్, కురుమూర్తి, వెంకటన్న, రాములు, గొడుగు రాజశేఖర్, పరదేశ్, శ్రీను, కోట్ల వెంకటేశ్, రమేశ్, అశోక్, మన్యం, కురుమూర్తి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెబ్బేరు, జూలై 19: రాష్ట్రంలో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని పెబ్బేరు మండల ముదిరాజ్ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పెబ్బేరులోని ముదిరాజ్ కమ్యూనిటీ హాలు వద్ద వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోనెల బాలస్వామి మాట్లాడుతూ బీసీ-డీ లో ఉన్న ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీచుపల్లి, కురుమూర్తి, భీముడు, మహేశ్ పాల్గొన్నారు.

బ్యాంక్‌లకు రైతుల క్యూ

ఉండవెల్లి జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రైతు రుణమాఫీని అమలు చేయడం తో రైతులు బ్యాంక్‌లకు క్యూ కడుతున్నారు. రైతులు పట్టాదారు , బ్యాంక్ పాస్ బుక్, అధికారులకు చూపించి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. రైతుల బ్యాంక్ ఆకౌంట్‌ల్లో రుణమాఫీ డబ్బు లు జమ అయినట్లు ఫీల్డ్ ఆఫీసర్ తెలిపారు. దీంతో ఎస్‌బీఐ వద్ద సందడి నెలకొన్నది.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు, జూలై 19 : పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి పర్యటించి ఆయా మండల కార్యాలయాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పెబ్బేరులోని ఫిషరీస్ కళాశాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఫిష్‌పాండ్లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లి పాఠశాల అభివృద్ధికి తన వంతుగా రూ.రెండు లక్షల సాయాన్ని ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వెంచర్లకు చెందిన భూమిని మాఫీ ఇనాంగా మార్చి ఓఆర్సీ తెచ్చి స్వాధీనం చేసుకొనేందుకు యత్నాలు జరుగుతున్నాయని బాధితులు ఆయనకు విజ్ఞప్తి చేయగా ప్లాట్ల వద్దకెళ్లి పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్థానిక పీర్ల చావిడిలో పూజలు నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

పెబ్బేరు, జూలై 19 : పెబ్బేరు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డిని మున్సిపల్ పాలకవర్గం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఆయన పెబ్బేరు పర్యటనకు వచ్చిన సందర్భంగా చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. సుభాష్ చౌరస్తా నుంచి అంబేద్కర్‌నగర్ వరకు గల రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని, ఇప్పటికే మంజూరైన బీటీ రోడ్డును నిర్మించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ పనులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, వివాదంలో ఉన్న సంత స్థలానికి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

కేంద్రంలో అధికారంలో ఉన్నా రైతులను ఆదుకోలేదు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మదనాపురంలో రైతు సంబురాలలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట/మదనాపురం, జూలై 19 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాష్ట్రంలోని రైతులను ఆదుకోలేదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట, మదనాపురం మండలాల్లో రైతు రుణమాఫి చేసిన సందర్భంగా పట్టణంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బోయేజ్, అమర్‌రెడ్డి, పిజేబాబు, సత్యారెడ్డి, బీచుపల్లియాదవ్, రావుల కరుణాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మిషేక్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల, జూలై 19 : దివ్యాంగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లాకు చెందిన దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 25మంది దివ్యాంగులకు హైదరాబాద్‌కు చెందిన అలింకో సంస్థ ఉచితంగా ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు సొంతంగా ఎమ్మెల్యే చెల్లించి ట్రైసైకిళ్ల తీసుకొచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘం అధ్యక్షులు అరీఫ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- బాలల సంరక్షణ జిల్లా అధికారి రాంబాబు

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు

వనపర్తి టౌన్, జూలై 19 : మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి రాంబాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎన్ఆర్ ఒకేషనల్ కళాశాలలో మాదకద్రవ్యాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడుక ప్రమాదకరమైన వ్యసనమని, నేటి యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాలు నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైనదన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువులు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారని, ఒకసారి దీనికి బానిసలు అయిన తర్వాత దానిని వదిలించుకోవడానికి చాలా కష్టమన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ స్వరూప, చైల్డ్ లైన్ సెంటర్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఉన్నారు.

పులికల్ జెడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అయిజ, జూలై 19 : మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని హెచ్ఎం ఉషారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పులకల్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, సుమలత, బషీర్, రామాంజనేయులు, యాకోబు పాల్గొన్నారు.

కస్తూర్బాలో వన మహోత్సవం

గట్టు, జూలై 19 : స్థానిక కస్తూర్బా పాఠశాలలో వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్వో గుంటి గోపిలత మాట్లాడారు.

మొక్కలు నాటిన ఎస్సై

ఉండవెల్లి జూలై 19 : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ అవరణలో ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి శుక్రవారం మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అబ్దుల్ బాషా, రమేశ్, నర్సింహ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

గద్వాలటౌన్, జూలై 19 : నీతిఅయోగ్, సంపూర్ణత అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాం తాల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 10 గ్లూకో మీటర్లు, 4000 స్ట్రిప్స్, పది లాన్సెట్లు బాక్సులు భవిష్య భారత్ సభ్యులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. గట్టు మండలంలోని పన్నెండు దత్తత గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అలాగే సంస్థ ద్వారా గ్రామస్తుల ఆరోగ్యం మెరుగుపర్చే దిశగా చేపట్టనున్న పనులపై ప్రణాళికలను సంస్థ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ, భవిష్య భారత్ సలహాదారుడు డాక్టర్ జయంత్, రాష్ట్ర సమన్వయ కర్త వినయ్, నీతి అయోగ్ సమన్వయ కర్త అష్జల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

మదనాపురం, జూలై 19 :సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సైబర్ డీఎస్పీ రత్నం అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పోలీసులు విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ డీఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి మీ వచ్చే ఫోన్ కాల్స్‌ని నమ్మవద్దని, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. అలాంటి మోసపూరిత కాల్స్ వస్తే వెంటనే 1930కీ కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in లో రిపోర్ట్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ సత్యనారాయణ

గద్వాల అ